జీవనసంధ్య

[కథానిక]

"అమరేంద్ర"

"నిజంగానా?" అని ఆశ్చర్యంతో అడిగింది సంధ్య.

"నీతో ఎప్పుడైనా అబద్ధం ఆడానా సంధ్యా?" అని ఎదురుప్రశ్న వేశాడు ఆనందరావు.

నిజమేనా? అందులో ఆనందరావు అన్నంత పనీ చేసితీరే రకం.

అతని మాటలు వింటుంటే సంధ్య భయంతో కంపించిపోతోంది. అతని మాటలు నమ్మటానికీ వీలు లేదు, నమ్మకపోవటానికీ వీలులేదు. అర్థంకాని సందిగ్ధావస్థలో సంధ్య తన్నుకుంటున్నది.

"అయితే, ఆనంద్, ఎక్కడికి వెళ్ళిపోతావో చెప్పవా? అసలు ఇంత ఆకస్మికంగా నీకు ఇటువంటి కోరిక ఎందుకు కలిగిందో నేను తెలుసుకోగూడదా" అని వేదనతో వ్యాకులమైన కంఠంతో సంధ్య ప్రశ్నించింది.

"తెలుసుకోవచ్చు. కాని తెలిపేందుకు ఏముంది?" అని ఆనందరావు కిటికీలోంచి దూరాన కనిపిస్తున్న కొండలకేసి చూస్తూ బదులు చెప్పాడు.

"ఇటు చూడు ఆనంద్! నాతో మాట్లాడటానికి ఇంత బెదిరిపోతున్నావేం? ఇంతలోనే ఎంత మారిపోయావో? ఏదో రహస్యాన్ని నాకు చెప్పకుండా దాస్తున్నావు. అది బైటపడిపోతుందేమోనని బెదిరిపోతున్నావు. అంతమాత్రం నేను తెలుసుకోలేనను కున్నావా? నిజం చెప్పు. చెప్పేదాకా నిన్నిక్కడి నుంచి కదలనివ్వను. ఎక్కడికి వెళ్లి పోదలుచుకున్నావు? ఎందుకు వెళ్లి పోవా లనుకున్నావు?" అని సంధ్య దారికి అడ్డంగా నిలబడింది.

సంధ్యముఖంకేసి ఒకసారి చూసి ఆనందరావు తల వంచుకున్నాడు. సంధ్యకళ్లలోని మిరుమిట్లుగొలిపే వెలుగుముందు ఏరహస్యమూ దాగదు. ఆ వెలుగు తన హృదయంలోని మర్మాలన్నిటినీ ఛేదించివేస్తుంది. కాని ఏమని చెబుతాడు? ఏమీ తోచలేదు. చివరికి "సంధ్యా, నిజంగా నీకు ఏం చెప్పాలో నాకు తెలియటంలేదు. ఎక్కడికి వెళ్తానో నాకే తెలియదు. ఎందుకు వెళ్లా లనుకుంటున్నానోకూడా నాకు తెలియదు" అన్నాడు.

"ఎంతసేపూ ఒకటేమాట. అయితే నీ రహస్యం నువ్వే దాచుకో. పాపం, వెళ్తున్నానని చెప్పటానికి మటుకు వచ్చావు. సంతోషం..."

"చెప్పటానికిమాత్రమే కాదు. పెళ్ళినాటికి వుండను. వెళ్ళిపోయేముందు నిన్ను దీవించి వెళ్లాలని వచ్చాను" అంటుండగానే ఆనందరావుమాటలకి అడ్డం వచ్చి "అప్పుడే దీవించేటంత పెద్దమనిషివై పోయావు కాబోలు" అని సంధ్య చిరునవ్వు నవ్వింది. ఆ చిరునవ్వు శరత్కాలపు వెన్నెలలాగా ఆనందరావుహృద

యాన్ని క్షణంలో ఆవరించింది. మనసులోని చీకటి మబ్బులన్నీ ఆ వెన్నెలలో కరిగిపోయినై. అతని కూడా బదులుగా చిరునవ్వు నవ్వాలనిపించింది. కాని అప్రయత్నంగా కనురెప్పల్లోంచి అశ్రువులు తొంగిచూసినై.

"అయితే, ఒక్కమాట అడుగుతాను ఆనంద్: నామీద కోపగించుకుని వెళ్లిపోతున్నావా? యావజ్జీవితమూ నన్ను వేధించదలుచుకున్నావా?"

"లేదు సంధ్యా, నామాట నమ్ము. నాకు ఎవరిమీదా కోపం లేదు. నీమీద అసలే లేదు. విధి మీదా, లోకంమీదా కోపగించుకునే అధికారం మానవుడికి లేదు."

"ఏమిటో నీమాటలు చాలా కొత్తగా వున్నయ్."

"అవును. ఎల్లుండినుంచి నువ్వు కొత్తదానివి కాబోతున్నావు. అందుకని ఇవాళే నామాటలు కొత్తగా కనిపిస్తున్నయ్. దీంట్లో ఆశ్చర్యమేముంది?" అన్నాడు. ఈ మాటలలోని వెటకారం సంధ్యహృదయానికి సూటిగా తగిలింది. బదులు చెప్పలేకపోయింది. మాటలకందని బాధ సంధ్యముఖాన్ని చీకటిమబ్బులాగా కమ్మివేసింది.

వారిద్దరిమధ్యా క్షణక్షణమూ అశ్రువులతో వేదనతో బరువెక్కేమౌనం ఇనపగోడలు కడుతోంది. చిన్ననాటినుంచీ ఆటపాటలతో కలిసిమెలిగిన వారిద్దరూ ఈక్షణంలో ఎంతో అపరిచితులమాదిరిగా మారిపోయారు. ఇద్దరిమధ్యా ఏదో దాటలేని అఖాతం మోతలు పెడుతోంది.

ఈ దారుణమౌనాన్ని భంగంచేస్తూ "వెళ్లొస్తాను సంధ్యా" అని ఆనందరావు రెండడుగులు వేశాడు.

"వెళ్లక తప్పదన్నమాట. నీ సంకల్పానికి తిరుగులేదని నాకు తెలుసుగా" అంది సంధ్య.

ఆ మాటకు బదులు చెప్పకుండా ఆనందరావు "వెళ్తూ ఒక్క కోరికమట్టుకు కోరుతున్నాను. అది నువ్వు తప్పకుండా పాటించాలి సంధ్యా" అన్నాడు.

"నీకు సందేహమెందుకు ఆనంద్? అది ఎంత దుర్ఘటమైన కోరిక అయినా సరే" అని సంధ్య బదులు చెప్పింది.

"నన్ను మరిచిపో, పూర్తిగా మరిచిపో సంధ్యా. నేను నీ గతజీవితంలోని కారుమబ్బుని, పీడకలని. నన్ను నీహృదయంలోంచి తరిమివెయ్యి. నీ భావి సుఖంతోనూ, శోభతోనూ మంగళమయంగా వుండాలని కోరుకుంటున్నాను. ఇదే నా చివరికోరిక" అంటూనే ఆనందరావు గబగబా గదిబైటికి వెళ్లాడు.

ఈమాటలకి సుడిగాలికికంపించే లతలాగా సంధ్య వొణికిపోయింది. అక్కడే నిలబడిపోయింది. చూస్తుండగానే ఆనందరావు మలుపుతిరిగి చెట్లగుబుర్లలో మాయమైపోయాడు. పరిసరమంతా చీకటి వెలుగుల దాగుడుమూతల్లో వింతగా మారిపోతోంది. దూరాన కొండలవరసలూ, చెట్లగుబుర్లూ, చెరువులో నీళ్ళూ సంజకెంజాయలతో నిండిపోతున్నయ్. ఆక్షణంలో ప్రకృతిలో కన్నీళ్లకీ, చిరునవ్వుకీ స్నేహం కుదిరింది.

కాని సంధ్యహృదయం బాష్పదరహాసాలమధ్య ఊయలలూగుతోంది. ఎల్లుండే సంధ్యపెళ్లి. ఇవాళ తన చిన్ననాటి స్నేహితుడు అకస్మాత్తుగా ఎక్కడికో వెళ్లిపోతున్నాడు. ఎందుకో చెప్పడు. కాని సంధ్యకి తెలియకపోలేదు. తెలుసుకనకనే మనసులో ఇంత బాధ.

ఇక తెల్లారితే సంధ్యపెళ్లి. ఆరాత్రే ఆనందరావు ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయాడని ఊరంతా గగ్గోలు. పరారి అయిపోయాడని కొందరూ, ఆత్మహత్య చేసుకున్నాడని కొందరూ ఎవరికి తోచినట్లు వాళ్లు తీర్మానించుకున్నారు.

ఈవార్త విని సంధ్య నివ్వెరబోయింది. అనుకున్నంత పనీ జరిగింది. కళ్యాణకింకిణుల మంగళధ్వనుల మాటునుంచి, తూర్యరావాలమాధురుల చాటునుంచి, మాటిమాటికీ "నన్ను మరిచిపో, నన్ను మరిచిపో" అన్న మాటలే వినిపిస్తున్నయ్.

౨

"స్వామీజీ"

"ఎవరు నాయనా,—నువ్వా ఆనంద్? ఏం ఇంత అర్ధరాత్రి వచ్చావు?"

"నాకు దీక్ష ఇప్పించండి. ఇప్పుడే ఇప్పించండి."

"అంత తొందర రెందుకు బాబూ? నీ పరీక్షా కాలం ఇంకా పూర్తికాలేదు."

"స్వామీ, ఇంక నేను పరీక్షకి నిలవలేను. నన్నొక ఒడ్డుకి చేర్చండి. నన్ను రక్షించండి. నాకు దీక్ష ఇప్పించండి. మీపాదాలకి సేవచేస్తూ జీవిత మంతా గడిపివేస్తాను" అని వ్యాకులపాటుతో గురువు గారి పాదాలమీద వాలి విన్నవించుకున్నాడు.

ప్రశాంతవదనంతో స్వామీజీ ఆనందమాటలు విన్నారు. జీవితంలోని సుఖదుఃఖాలన్నిటికీ అతీత మైన శాంతి ఆయనముఖమండలంలో మెరుస్తోంది. ఆశ్రమమంతా నిద్రలో మునిగివుంది. ఆయన ఒక్కడే మేలుకొని ఏదో చదువుకుంటున్నారు. ఎన్నాళ్లనుంచో ఆనందతో మాట్లాడాలని ఆయన అనుకుం టున్నారు. స్వామీజీతో సంభాషించి తన అశాంతిని ఆయనకి నివేదించాలని ఆనంద ఎన్నాళ్లనుంచో వేచి వున్నాడు. ఇటువంటి ఏకాంతసమయంకోసమే ఇద్దరూ ఎదురుచూస్తున్నారు.

కిటికీసందుల్లోంచి వెన్నెల జారివచ్చి స్వామీజీ ఆసీనులైవున్న చోటని బంగారుకాంతులతో నింపు తోంది.

మధురగంభీరస్వరంతో "నాయనా, ఆనంద్, దీక్షకోసం ఎందు కింత తొందరపడుతున్నావు? నీ ముఖంలో ఎప్పుడూ ఏదో అశాంతి, ఏదో విచారం కనిపిస్తున్నయ్. ఇంకా నీ పరీక్షాకాలం పూర్తికాలేదు. దీక్ష స్వీకరించే అర్హతని నువ్వు పొందలేదు" అని స్వామీజీ ఆనందరావుముఖంకేసి చూశారు. ఆనంద తలవంచుకుని మెదలకుండా కూచున్నాడు. దీపపు వెలుతురులో ముందుకిసాగలేక నిలబడిపోయి చుట్టలు చుట్టుకునే సర్పంలాగా అతని మనసు స్వామీజీ సన్నిధానంలో మెలికెలుతిరిగిపోతున్నది.

"నిజం చెప్పు ఆనంద్, నువ్వు ఎవరిమీద అలిగి ఇక్కడికి వచ్చావు?"

"నేను ఎవరిమీదా కోపగించుకుని రాలేదు స్వామీ. జీవితంలోని సుఖదుఃఖాలకి రోసి ఇక్కడికి వచ్చాను. జీవితాన్ని ఈశ్వరపదసన్నిధిని [illegible] పూజా ప్రసూనంగా సమర్పించాలనే ఆశతో ఇక్కడికి వచ్చాను."

"అయితే ఇక్కడ నీకు శాంతి లభించిందా?"

"లేదు స్వామీ, నాహృదయంలో ఏదో సమసి పోని సంఘర్షణ, ఏదో చెప్పలేని అశాంతి. ఉన్నత లక్ష్యాన్ని చేరుకోలేమనే భయంతో ప్రతిమెట్టు ఎక్కే టప్పుడూ కాళ్లు వణికిపోతున్నయ్. ఇక్కడినుంచి ఏక్షణంలో జారి అధఃపాతాళానికి అణగారిపోతానో అనే తీరని బాధ. అందుకే స్వామీ, తొందరగా దీక్ష ఇప్పించండి. వెనక్కి తిరిగి శ్లేదారి మూసెయ్యండి. నన్ను కాపాడండి" అని వ్యగ్రస్వరంతో విన్న వించాడు.

"నువ్వు తొందరపడుతున్నావ్ ఆనంద్. అంత తేలికగా దీక్ష లభించదు. నీసంకల్పం బలీయమై నీ పూర్వబంధాలన్నిటినీ దగ్ధం చెయ్యాలి. నీ మనసులో ఏ కోరికా దాగివుండకూడదు."

"నా వాంఛలన్నిటినీ భస్మం చేశాను స్వామీ"

"లేదు ఆనంద్. నువ్వు పొరబడుతున్నావు. కోరికలేని మనసులో అశాంతి వుండదు. నీకే తెలియని కోరికలేవో నీ ఆంతర్యంలో దొంగచాటుగా నక్కి వున్నయ్. వాటిని కూకటివేళ్లతో పెకలించివెయ్యి. అంతవరకూ నీకు దీక్ష లభించదు."

"అయితే ఈ ఎడతెరిపిలేని సంఘర్షణలోంచి నన్ను రక్షించరా స్వామీ?"

"నిన్ను ఉద్ధరించుకునే మార్గం నువ్వే కను క్కోవాలి, ఆనంద్. ఆత్మపరీక్ష అగ్నిపరీక్ష. నీ అశాంతికి కారణం నువ్వే అన్వేషించి నిర్మూలించు."

"శలవు, స్వామీజీ"అని ఆనందరావు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తనకే తెలియని కోరిక ఏదో తన మనసులో దాగుడుమూతలాడుతున్నదా? అదే తన అశాంతికంతటికీ మూలమా? అన్ని కోరికలనీ దాటివచ్చిన తన కింకేం కోరిక వుంది? ఆనందరావు మనస్సు తుపానునాటి సముద్రంలాగా సంక్షోభిస్తోంది.

ఆశ్రమంలో తన గదికి చేరుకున్నాడు. గురువు గారి కుటీరంలోని దీపం చీకటిలో లీనమైపోయింది.

వెన్నెలని చూసి తెల్లవారిం దనుకుని పొరబడ్డ పక్షులు చెట్లగూళ్లలో సందడిచేస్తున్నయ్.

అంతా గభీరమైన నిశ్శబ్దం. అంతటా చల్లటి వెన్నెల. ఆశ్రమమంతా రమణీయమైన ప్రశాంతిలో మధురనిద్రలో మునిగివుంది.

నిద్రపట్టని ఆనందహృదయంమాత్రం బద్దలు కావటానికి ఎదురుచూసే అగ్నిపర్వతంలాగా కళపెళ కాగిపోతోంది.

ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ, గతకాలపు మరుపుతెరల మాటునుంచి "నన్ను మరిచిపో సంధ్యా, నన్ను పూర్తిగా మరిచిపో" అన్న తన మాటలు వికృతంగా వినిపించినై. ఆనంద ఆపాదమస్తకమూ కంపించిపోయాడు. సంధ్యస్మృతి ఒక్కసారిగా అతని హృదయాన్ని అమృతహాలాహలాలతో నింపివేసింది. ఆశ్రమాన్నంతటినీ ఆవరించిన వెన్నెలచల్లదనంలో సంధ్య చిరునవ్వు కనిపించింది. ఆ ప్రశాంత విభావరి ప్రసరించే మధురజ్యోత్స్నలలో సంధ్య విశాలనయనాల వింతకాంతులు కనిపించినై. ఇంత కాలమూ అతని మనసుని ఆవరించిన అశాంతి ఈ క్షణాలలో సంధ్యగా రూపొందిన ట్లనిపించింది.

దారితెలియని బాటసారి నడిచినడిచి తనకి తెలియకుండానే చేరదలుచుకున్న నగరాన్ని చేరితే ఎంత ఆశ్చర్యపోతాడు! ఎంత ఆనందిస్తాడు! ఆనంద హృదయంకూడా అటువంటి స్థితిలోనే వుంది.

కాని తానెవరు? సంధ్య ఎవరు? సంధ్య స్మృతిని తన హృదయంలోంచి దూరంగా తరిమివేయటంకోసం కాదా తను ఇక్కడికి వచ్చింది? స్వామీజీసారథ్యంలో ఆధ్యాత్మిక జీవనపథంలో సాగిపోయి కేవలంభౌతికజీవితమధురస్మృతియైన, సంధ్యని హృదయంలోంచి పెకలించివేయాలనే వజ్రసంకల్పంతోనే తానిక్కడికివచ్చాడు. తన జాడతెలియక ఇంటిదగ్గర బంధుమిత్రులు, తల్లిదండ్రులు ఎంత తల్లడిల్లినా తాను సరుకుచేయలేదు. తన సంకల్పబలం, తన దీక్షా ప్రయాస-అన్నీ ఆనిమిషంలో గాలికికొట్టుకుపోయే మబ్బులమాదిరిగా మాయమైపోయినై. తనని ఓడించిన సంధ్యస్మృతి అతని హృదయాకాశంలో తీయని వెన్నెలగా అలుముకు పోతోంది. ఆ క్షణంలో ఆనంద పరాజితుడైనాడు. కాని వెయ్యివిజయాలు ఒక్కసారి సాధించినా అంత ఆనందంతో అతని మనసు పొంగిపోయేది కాదు.

3.

సంధ్య అత్తవారింటికి వెళ్లిన ఏడాదికే పుట్టింటికి తిరిగివచ్చింది. ఆమెభర్త అకాలమరణానికి కంట తడిపెట్టనివాళ్లు లేరు. సంధ్యజీవితం దరీ తెన్నూ లేని శోకసాగరమైపోయింది. నిత్యనిశీథమైన ఆమెజీవితానికి ఒక్కటే ఆశాజ్యోతి—రెండునెలల పసిపాప రమ. ఆ పసిపాపకోసమే సంధ్య దుర్భరదుఃఖాన్ని దిగమింగుకుంటూ జీవయాత్రని సాగిస్తోంది.

అందరూ వచ్చి సంధ్యను ఓదార్చిపోతున్నారు. ఒకరోజున బాగా చీకటిపడ్డాక ఎవరిదో ఒక నీడవచ్చి సంధ్యగదిలో నిలబడింది. దీపం కొడిబారి గది అంతా మసకగా వుంది. ఆ వచ్చిన వ్యక్తి ఎవరో సంధ్య వెంటనే గుర్తుపట్టలేక పోయింది. తనంతట తను ముందుగా పలకరించటానికి నోరురావటంలేదు. "ఇంత చిన్నవయస్సులోనే ఎంత పెద్ద కష్టం నెత్తినపడిందే తల్లీ" అని వచ్చిన వ్యక్తి ఒక్కశోకం పెట్టింది. ఆ కంఠాన్ని సంధ్య గుర్తుపట్టింది. కాని నమ్మలేక పోయింది. ఆశ్చర్యంతో దీపం పెద్దదిచేసింది. తెల్లటి ముసుగులో దీనంగా తల వంచుకున్న ఆముఖాన్ని చూడగానే సంధ్య స్తంభించిపోయింది. కంఠాన్ని ఎవరో గట్టిగా నొక్కివేసినట్లయింది. పెగుల్చుకుని "అత్తయ్యా" అని సంధ్య ఒక్కసారి ఆక్రందించింది.

"అవును తల్లీ! నీ పాపిష్ఠి అత్తయ్య ఇంకా బతికేవుంది. ఆమహారాజుమాత్రం దాటిపోయారు. మొండిఘటాన్ని నేను మటుకు బతికేవున్నాను. వీధిముఖం చూడకపోయినా నువ్వు వచ్చావని విన్నాక మనసు నిలవలేదు. ఎంత ఆపద వచ్చిందే తల్లీ!" అని మాట్లాడలేక మధ్యలో ఆగిపోయింది. సంధ్య శ్రావణ మేఘంలాగా కరిగిపోయింది.

"ఊరుకో తల్లీ, ఏడ్చి లాభంలేదు. ఎన్ని కష్టాలు వచ్చినా మొండిగా భరించటంతప్ప మన మేం చెయ్యగలం? ఆ పసిదాన్ని చూసుకుని దుఃఖాన్ని దిగమింగుకోవాలమ్మా." అని సంధ్య కన్నీళ్లని తన కొంగుతో తుడిచింది. దుఃఖంతో కుమిలిపోయే హృదయం శోకాగ్నిలో దగ్ధమౌతున్న మరొక హృదయాన్ని చల్లటి మాటలతో ఊరడించింది. ఈ మాటలు సంధ్యకి ఎంతో శక్తినిచ్చినయ్. బలవంతాన కన్నీటిని ఆపుకుంటూ వొణుకుతున్న కంఠంతో సంధ్య అడిగింది "బావజాడ ఏమైనా తెలిసిందా?" అని.

"ఏం చెప్పను తల్లీ?" అని ఒక్కసారి ఆవురుమంది. కొంచెంసేపున్నాక "తండ్రిపోయినరోజే వాడి దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. ఫలానాచోట వున్నానని రాయలేదు. క్షేమంగా వున్నాననీ, తనకోసం విచారించవద్దనీ రాశాడు. వారి ప్రాణం పోకముందు ఆవుత్తరం అందితే ఎంత సంతోషించేవారోగదా! కాని నాకు ఈ రాత వుంటే అల్లా ఎందుకు జరుగుతుంది? మొండిఘటాన్ని ఇంకా చావలేక బతికున్నాను. ఎప్పటికైనా మనసు తిప్పుకుని వాడు ఇంటికి వస్తాడనే ఆశ నాకు. ఏమంటావు తల్లీ, వస్తాడంటావా?" అని ఎంతో ఆత్రంగా సంధ్యకేసి చూసింది. ఆ తల్లి మనోవేదనని గ్రహించి సంధ్య "వస్తాడు, తప్పకుండా రావచ్చు" అంది.

"చల్లిటిమాట చెప్పావు తల్లీ. నీ నోటివాక్యాన వాడు క్షేమంగా ఇంటికివస్తే నా కింకేం కావాలి!" అంటూ కొడుకు తిరిగివచ్చినంతగా సంబరపడుతూ ఆమె ఇంటికి బయలుదేరింది. ఆ నిమిషంలో సంధ్య కళ్లముందు పెద్ద మెరుపు మెరిసిన ట్లయింది. ప్రతి హృదయంలోనూ ఏదో మిణుకుమనే ఆశ! ఆ ఒక్క ఆశకోసమే ప్రాణంబిగబట్టుకుని, దుర్భరదుఃఖాన్ని దిగమింగుకుంటూ జీవితపథంలో మొండిగా ముందడుగు వెయ్యాలి. ఉయ్యాలలో నిద్రపోతున్న రమ కదిలిన అలికిడి అయింది. సంధ్య చివాలున లేచి వెళ్లింది. ఈ మిణుకుమనే వెలుగే తన జీవితంలోని కారుచీకటిని పటాపంచలు చేస్తుందన్న విశ్వాసం క్షణంలో సంధ్య హృదయాన్ని శక్తితో నింపివేసింది.

౪

ఆశ్రమవాసులంతా ఆనందరావు ఆరోగ్యాన్ని గురించి ఆందోళనపడుతున్నారు. అతని వ్యాధి నానాటికీ ఎక్కువైపోతోంది. మనిషి ఆనాటికంటే ఆనాడు దిగనాసిల్లిపోతున్నాడు.

"పోనీ, ఒకసారి ఇంటికి వెళ్ళిరా బాబూ. నీ కోసం ఇంటిదగ్గర తల్లిదండ్రు లెంత క్షోభపడుతున్నారో! జబ్బు తగ్గినాక మళ్ళీ రావచ్చును" అని పక్కన కూచుని విసురుతూ స్వామిజీ బతిమాలుతున్నారు.

"వొద్దు స్వామీ, ఇంటికి వెళ్లాలని లేదు. నన్ను మీ పాదాలదగ్గరే వుండనివ్వండి. నాకు దీక్ష ఇప్పించండి. నేను ఇక్కడే మరణిస్తాను. మీరే నాకు తల్లీ, తండ్రీ" అని ఆనంద్ నీరసంగా బదులుచెప్పాడు.

"కొంచెం నిద్రపట్టించుకో ఆనంద్" అని స్వామిజీ విసురుతూ పక్కనే కూచున్నారు. మాట్లాడుతూనే ఆనంద్ కళ్లుమూసి నిద్రపోయాడు. కాని స్వామిజీకి ఆనంద్ సంగతి విషమసమస్యగా వుంది. దీక్షకోసం తొందరపడుతున్నాడు. పరీక్షాకాలం పూర్తికాలేదు. పైగా మనిషిముఖంలో ఎప్పుడూ ఏదో చింతకనిపిస్తుంది. ఆ కారంలో ఎప్పుడూ అశాంతి కనిపిస్తుంది. అతన్ని చూస్తుంటే గతకాలంతో తెగతెంపులు చేసుకున్నట్లు కనిపించడు. పూర్వాశ్రమానికి సంబంధించిన బలీయమైన బంధా లేవో ఇంకా అతన్ని చుట్టుకునివున్న ట్లనిపిస్తుంది. తనమీద తనకే నమ్మకం లేక దీక్షఇప్పించమని తొందరపడుతున్నాడు. గతజీవితంలోకి తిరిగివెళ్లే దారులని మూసే ఇనపతలుపు దీక్ష అనుకుంటున్నాడు. స్వామిజీకి అతని హృదయం దీక్షాజ్వాలల్లో నిలబడటానికి పరిపక్వం కానట్లు తోచింది. కాని ఇతనికి దీక్ష ఇవ్వకుండా ఎంతకాలం జాగుచెయ్యటం? ఇతని భావిజీవితాన్ని ఏవిధంగా నడిపించటం? ఇవే స్వామిజీని వేధిస్తున్న ప్రశ్నలు.

ఇంతలో ఆనంద్ నిద్రలో అటూ ఇటూ కదిలాడు. "సంధ్యా సంధ్యా" అని రెండుసార్లు కలవరిం

చాడు. స్వామిజీ "ఆనంద్, ఆనంద్" అని పిలిచారు. ఆనంద్ పలకలేదు. ఆ కలవరింత స్వామిజీ మనస్సులో అస్పష్టంగా వున్న అనుమానాన్ని బలపరిచింది.

తెల్లవారేసరికే ఏర్పాట్లన్నీ పూర్తిఅయినయ్. ఇద్దరు శిష్యులని తోడుపెళ్ళి ఆనందరావుని ఇంటిదగ్గర దింపిరమ్మని స్వామీజీ ఆజ్ఞాపించారు.

నిద్రలేవగానే తన ప్రయాణం స్థిరమైపోయిందని విని ఆనందరావు నిర్వ్వెరపోయాడు. "స్వామీ, నాకు దీక్ష అనుగ్రహించరా? నన్ను మీపాదాలదగ్గర నిశ్చింతగా చనిపోనివ్వరా? నేను చేసిన తప్పిదమేమిటి స్వామీ? నాకెందు కింత కఠినశిక్ష విధిస్తున్నారు?" అని దీనంగా వేడుకున్నాడు.

"నువ్వు ముందు ఇంటికి వెళ్ళిరా ఆనంద్" అని స్వామీజీ బదులుచెప్పారు. ఇక వ్యవధి అయిపోవస్తోంది. శిష్యులు ప్రయాణసన్నాహాలన్నీ పూర్తి చేసుకున్నారు. బయలుదేరేముందు స్వామీజీ అందరినీ బైటికిపంపించిప్రశాంతస్వరంతో "ఆనంద్, నిన్నరాత్రి నిద్రలో సంధ్యా అని కలవరించావు. ఎవరాసంధ్య? నీకేమౌతుంది? నిజం చెప్పు" అని అడిగారు.

దొరికిపోయిన దొంగలాగా ఆనందరావు సిగ్గుతో ముగ్గిపోయాడు నోట మాటరావటం లేదు. అప్రయత్నంగా ఆనంద్ కళ్లు అశ్రువులతో నిండిపోయినై. "చెప్పవేం ఆనంద్?" అని స్వామీజీ రెట్టించి అడిగారు.

"ఏం చెప్పను స్వామీ? ఆమె నాకేమీ కాదు. నే నామె కేమీ కాను. ఇంతకుమించి నే నేమీ చెప్పలేను" అని ప్రక్కమీదినుంచి ప్రయత్నంమీద లేచి గురువుగారి కాళ్లని తన శుష్కించిన చేతులతో చుట్టివేశాడు.

"వేళయింది, ఇక బయలుదేరు ఆనంద్" అని స్వామీజీ ఆనందును లేవనెత్తి కూచోబెట్టారు.

"శలవు స్వామీ. మళ్ళీ మీపాదాలదగ్గరికి తిరిగి రాగలనా? ఎందుకో భయంగా వుంది స్వామీ" అని ఆనంద్ దీనంగా అన్నాడు.

"నీ భయమే నీ శత్రువు ఆనంద్" అని స్వామిజీ స్నానానికి నదీతీరానికి గబగబా నడిచారు.

౫

ఆనందరావు ఆకస్మికంగా జబ్బుచేసి ఇంటికి వచ్చాడన్న వార్త విని సంధ్య నమ్మలేకపోయింది. కలలోకూడా అతను తిరిగివస్తాడనుకోలేదు. వచ్చాడని విన్నాక వెళ్లిచూసివచ్చేదాకా మనసు నిలవటం లేదు. భర్తపోయాక తను లోకంముఖమే చూడలేదు. కాని తన చిన్ననాటి మిత్రుడు జబ్బుతో ఇంటికి తిరిగి వచ్చాడని విని ముందువెనకలు చూడకుండా బయలుదేరింది. అతను వచ్చాడనగానే ప్రాణంలేచివొచ్చింది. చిన్ననాటి స్మృతులన్నీ ఒక్కసారిగా కళ్లముందు మెరిసినై. ఎన్నడూ లేని ఆనందంతో సంధ్య హృదయం చిందులు తొక్కుతోంది.

సంజచీకటి పడుతోంది. రమ నిద్రపోతోంది. సంధ్య బయలుదేరింది. ఎవరికీ చెప్పలేదు. ఎవరి అనుమతీ కోరలేదు. ఏదీ ఆలోచించలేదు.

ఆనందరావుని చూడడానికి సంధ్య స్వయంగా రావటం చూసి అతని తల్లి నిశ్చేష్టురాలైపోయింది. "రా తల్లీ, రా. నీకు మామీద దయతప్పలేదు" అంటూ ఆనందరావు మంచందగ్గర కుర్చీపీట వేసి కూచోమన్నది.

అంతవరకూ కళ్లుమూసుకుని పడుకున్నాడు ఆనందరావు. కళ్లుతెరిచి ఆశ్చర్యంతో "ఎవరదీ, ఎవరూ, సంధ్యా? నన్ను చూడటానికి వచ్చిందా? ఇక్కడే వుందా?" అంటూ లేచి కూచోబోయాడు.

"లేవకు ఆనంద్" అంటూ సంధ్య మంచం దగ్గర కూచుంది.

"నన్ను మరిచిపోలేదా సంధ్యా?"

"నువ్వే మమ్మల్నందరినీ మరిచిపోయావు. నువ్వే మా కందరికీ దూరమైపోయావు" అంటుంటే అతని తల్లి "నిజం చెప్పావమ్మా. వాడి కాషాయ గుడ్డలు చూస్తుంటే నాకడుపు చెరువైపోతోంది" అని కళ్లు తుడుచుకుంది.

అడివిలాగా పెరిగి పోయిన గిరజాల జుట్టు ముఖమంతా కమ్మేసింది. పొదలాగా గడ్డం పెరిగి పోయింది. చీకటిపడగానే పొదల్లో మెరిసే మిణుగురు పురుగుల్లాగా అతని విశాలనయనాలు వెలుగుతున్నయ్. ముఖంలో కళ్లుమాత్రమే కనిపిస్తున్నయ్. ఈరూపాన్ని చూడగానే సంధ్యగుండె జలదరించింది.

సంజచీకటినీడలు గోడలమీద అలుము కుంటున్నయ్. ఆనీడలలో ఒక నీడలాగా మౌనంగా కూచుంది సంధ్య. ఇంతసేపూ ఆనంద రెప్పవాల్చ కుండా సంధ్యముఖంకేసి చూస్తున్నాడు. "ఇదేమిటి సంధ్యా ? మరిచిపోయావా ?" అని ఆత్రంగా అడిగాడు ఆనంద్. అతని కళ్లు సంధ్యవిశాలఫాల భాగాన తరుణారుణప్రభలతో వెలిగే సౌభాగ్యరేఖ కోసం వెతుకుతున్నయ్. ఇది గమనించి సంధ్య నీళ్లు నిండిన కళ్లతో, వణికే కంఠంతో "లేదు ఆనంద్, దైవమే చెరిపివేసింది" అని అతనికి ముఖం చూపలేక తలవంచుకుని కళ్లు తుడుచుకుంది.

"ఎంత ఘోరవార్త సంధ్యా" అని ఆనందరావు పిడుగుదెబ్బతిన్నవాడిలాగా దిండుమీదికి ఒరిగి పోయాడు.

వారి మౌనం క్షణక్షణమూ విషాదంతో బరు వెక్కిపోతున్నది. ఇంతలో అతని తల్లి సంజెదీపం వెలిగించి గదిలో పెట్టి జావకాచి పట్టుకువస్తానని వెళ్లింది.

"నాకోసం విచారించకు ఆనంద్. నిన్ను చూస్తుంటే నాగుండె నీరవుతోంది" అంది సంధ్య.

"ఎంత క్రూరమైన విధి! సంధ్యా, మనం విధికి బానిసలం." అంటూ ఆనంద్ కిటికీలోంచి అలుము కుంటున్న చీకట్లోకి చూశాడు. అంతా కాటుక పులి మినట్లుంది.

"సంధ్యా!" అన్నాడు ఆనంద్ స్నేహ పూరితమైన కంఠంతో. ఎందుకో సంధ్య చేతులను తన చేతుల్లోకి తీసుకోవా లనిపించింది.

"ఆనంద్" అని బదులుపలికింది సంధ్య. తన చేతులతో అతని బాధితహృదయాన్ని నిమిరితే బాగుండుననిపించింది. కాని శతాబ్దాల సంస్కారం ఒక్కసారిగా ఆకోరికని కాలికింద తొక్కివేసింది.

"వెళ్లుస్తాను ఆనంద్. ఇంటిదగ్గర పిల్ల నిద్రలేచి ఏం గొడవపెడుతోందో" అని సంధ్య లేచి నిల బడింది.

"వెళ్తున్నావా సంధ్యా ? ఈ బద్దలయ్యే అగ్ని పర్వతాన్ని నీస్పర్శతో చల్లార్చి వెళ్లవూ ?" అంటూ ఆమెచేతులని తన చేతుల్లోకి తీసుకుని గుండెలకి అదుముకోబోయాడు.

అతని చేతులని ఒక్కవిసురు విసిరి "నేను వెళ్లి పోవాలి ఆనంద్" అంటూ సంధ్య తూనీగలాగా బైటికివెళ్లిపోయింది.

ఆనంద్ సిగ్గుతో, దుఃఖంతో గజగజ వణికి పోయాడు. తను ఈలోకంలో ఎందుకు జన్మ ఎత్తానా అని ఎంతో నిందించుకున్నాడు.

అతని హృదయంలో కాటుక మబ్బులు దట్టంగా కమ్ముకుపోయినై. జావ తెచ్చిన తల్లి "సంధ్య వెళ్లిపోయిందా నాయనా?" అని అడిగింది. ఆమాటకి బదులు చెప్పకుండా "అమ్మా, ఇవాళ ఇంత చీకటిగా వుందేం ?" అని అడిగాడు.

౬

"కబురుచేశావా అమ్మా" అని అడిగాడు ఆనందరావు.

"నేనే వెళ్లి చెప్పివచ్చాను బాబూ."

"అయితే నాగడువు దగ్గరికి వచ్చిందని చెప్పావా ? ఈరాత్రి గడవటమే కష్టం."

"ఛీ, అల్లా అనరాదు నాయనా."

"నీకు తెలియదమ్మా. నిజం."

కొంచెంసేపు మౌనంగా వుండి గోడవైపుకి తిరిగి తనలో తను "రాదు, ఎందుకు వస్తుంది ? నేను తన కేమౌతాను ? తను నాకేమౌతుంది ? రాదు. క్షమించమని అడిగే అవకాశంకూడా లేదు." అని సంధించిన రోగిలాగా గొణుగుకుంటున్నాడు.

"నాయనా" అని పిలిచింది. చేత్తో కదిపింది. మారుపలకలేదు. రాత్రి అంతా ఏదో మగతగా పడి వున్నాడు. తెల్లవారుఝామున బాగా తెలివివచ్చింది. ఆరిపోయేముందు దీపం గప్పున వెలిగినట్లు అతని ముఖంలో చైతన్యం ధగధగ మెరిసింది. "రాలేదా అమ్మా ?" అని అడిగాడు.

"లేదు నాయనా, మళ్లీ వెళ్లి పిలుచుకొస్తా" అంటుంటేనే అడుగుల అలికిడి వినబడింది.

కిటికీలోంచి అరుణరాగరంజితమైన ఆకారం కరుణతో తొంగిచూస్తోంది.

వచ్చింది సంధ్య. కూడా మూడేళ్ల ముద్దుల మూట రమకూడా వచ్చింది.

"వచ్చావా సంధ్యా ? నీ క్షమాభిక్ష లేకపోతే నాప్రాణం పోయేట్లు లేదు" అని రెండుచేతులతో ముఖాన్ని కప్పుకున్నాడు. చెక్కిళ్లమీద కన్నీటిధారలు మెరిసినై.

"వచ్చాను ఆనంద్. నీమాటలు నాకు అర్థం కావటం లేదు" అని సంధ్య సంభ్రమంతో అన్నది.

"ఆయన వొలే అమ్మా?" అని తల్లికొంగు పుచ్చుకుని అడిగింది రమ.

"మామయ్యగారు. జేజపెట్టు" అనగానే రమ చిన్నచేతులు జోడించి "ఎప్పుడొచ్చావే మాయ్య గాలు ?" అని అడిగింది.

ఈమాటలు వింటున్నంతసేపూ ఆనంద నరక యాతన అనుభవించాడు. మిరుమిట్లుగొలిపే వెలుతురులో దిక్కు తెలియక రెక్కలుకొట్టుకుంటూ ఎగిరే గబ్బిలం లాగా అతని ప్రాణం తన్నుకుంది. ఎంతోసేపు మాటల కోసం పెనగులాడాడు. సంధ్యసన్నిధానంలో ఆ నిమిషంలో ఆశ్రమంలో అన్వేషించినా లభించని అనిర్వచనీయశాంతి వెల్లివిరిసింది. ఎండమావులవెంట పరిగెత్తి విసివిన బాటసారికి ఆకస్మికంగా సుందరసరోవరం ఎదురయినట్లనిపించింది.

"మాట్లాడవేం ఆనంద్ ?" అని వ్యాకుల పాటుతో అడిగింది సంధ్య.

"సంధ్యా ! నువ్వే నాగురువు. నీదగ్గరే దీక్ష సంపాదించాను"అంటూ కళ్లు మూసుకున్నాడు. ఆ క్షణంలోనే అతని జీవితంలోని తీరని అశాంతి మరణ ప్రశాంతిలో లీనమైపోయింది.

ఏదో అర్థంకాని నాటకాన్ని చూస్తున్న ప్రేక్షకులలాగా అతని తల్లీ, సంధ్యా అయోమయంలో నిలబడిపోయారు.

కిటికీలోంచి అరుణరేఖలు పరుగిడి వచ్చి ఆనంద కళేబరాన్ని ఆలింగనంచేసినై.

అప్రయత్నంగా సంధ్యకళ్లలోంచి రెండు అశ్రుబిందువులు జారి ఆనందరావుహృదయంమీద చిందినయ్.

"అమ్మా, మాయ్య మాత్తాడడేం ?" అంది రమ.

"పద. ఇంటికి. వద్దంటుంటే వెంటబడి వచ్చావు" అంటూ సంధ్య ఆనందరావు శరీరాన్ని కడసారి కళ్ల జూసి ఇంటిదారి పట్టింది.